అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆటపాటలతో విద్య

ఉదయగిరి: అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆటపాటలతో కూడిన విద్యనందిస్తున్నామని, మూడేళ్లు దాటిన చిన్నారులను చేర్పించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ షేక్ షాను కోరారు. పట్టణంలోని యాదవపాళెం, కోళ్ల వీధి, వాల్మీకి వీధి, తదితర ప్రాంతాల్లో అంగన్‌వాడీ బడిబాట ర్యాలీని శుక్రవారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి అంగన్‌వాడీ కేంద్రాల్లో అందిస్తున్న ప్రీస్కూల్ విద్య, పోషకాహారంపై తల్లులకు అవగాహన కల్పించారు. చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపాలని కోరారు. అంగన్‌వాడీ కార్యకర్తలు బీ వెంకట రత్నమ్మ, ప్రమీల, తదితరులు పాల్గొన్నారు.

బడిఈడు పిల్లలను బడిలో చేర్పించాలి

అనుమసముద్రంపేట: బడిఈడు పిల్లలను బడిలో చేర్పించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయలక్ష్మి కోరారు. ఏఎస్‌పేటలో అంగన్‌వాడీ చిన్నాలతో కలిసి బడిబాట ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మూడేళ్లు పూర్తయిన చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపాలన్నారు. ఆరేళ్లు నిండిన చిన్నారులను పాఠశాలల్లో చేర్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు సుశీల, విజయలక్ష్మి, సావిత్రి, షాకీరా, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

గువ్వాడిలో అంగన్‌వాడీ బడిబాట

వరికుంటపాడు: మండలంలోని గువ్వాడి అంగన్‌వాడీ కేంద్రం పరిధిలో అంగన్‌వాడీ బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. అంగన్‌వాడీ కార్యకర్త విజయలక్ష్మి చిన్నారులతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు ఆటపాటలతో విద్యను అందిస్తున్నట్లు తెలిపారు. మూడేళ్ల నిండిన చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని కోరారు. ఐదేళ్లు నిండిన తరువాత చిన్నారులను సమీపంలోని ప్రాథమిక పాఠశాలల్లో చేర్పిస్తామని తెలిపారు.



ఉదయగిరిలో ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీలు

సీతారామపురం: మూడేళ్లు దాటిన ప్రీస్కూల్ పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రత్తమ్మ కోరారు. సంజీవరెడ్డినగర్‌లో అంగన్‌వాడీ బడిబాట ర్యాలీని నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు అందిస్తున్న ప్రీస్కూల్ విద్య, పోషకాహారంపై తల్లులకు అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ కార్యకర్త మహాలక్ష్మి, ఆయాలు పాల్గొన్నారు.


ఏఎస్‌పేటలో..

దుత్తలూరు: స్థానిక పూసలకాలనీ అంగన్‌వాడీ కేంద్రం పరిధిలో అంగన్‌వాడీ బడిబాట ర్యాలీని నిర్వహించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు నూర్జహాన్, నాగలక్ష్మి మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు ఆటపాటలతో కూడిన విద్యతో పాటు పోషకాహారం అందజేస్తున్నట్లు తెలిపారు. మూడేళ్లు నిండిన చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రంలో చేర్పించాలని కోరారు.

అల్లూరు: స్థానిక చాటపాళెం అంగన్‌వాడీ కేంద్రం పరిధిలో అంగన్‌వాడీ బడి బాట ర్యాలీ నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఏ రాజేశ్వరి పాల్గొని మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పూర్వ ప్రాథమిక విద్యా కార్యక్రమాల ద్వారా చిన్నారుల అభివృద్ధికి పునాదులు వేస్తున్నట్లు తెలిపారు. మూడేళ్లు నిండిన పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపాలని కోరారు.


వరికుంటపాడు మండలం గువ్వాడిలో..


సీతారామపురం మండలం సంజీవరెడ్డినగర్‌లో..


దుత్తలూరులో..


అల్లూరులో..

క్లుప్తంగా

జాతీయ లోక్‌అదాలత్‌ను జయప్రదం చేయండి


మాట్లాడుతున్న జడ్జి రాజేష్

ఆత్మకూరు: ఈ నెల 29న నిర్వహించనున్న జాతీయ లోక్‌అదాలత్‌ను జయప్రదం చేయాలని ఆత్మకూరు సీనియర్ సివిల్ జడ్జి బీ రాజేష్ కోరారు. శుక్రవారం జడ్జి తన చాంబర్‌లో ఆత్మకూరు డివిజన్ పరిధిలోని పోలీసు అధికారులు, న్యాయవాదులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ లోక్‌అదాలత్‌పై కక్షిదారులకు అవగాహన కల్పించి ఇరుపక్షాల అంగీకారంతో ఎక్కువ కేసులను పరిష్కరించేందుకు కృషి చేయాలని కోరారు. ఆత్మకూరు డీఎస్పీ ఎస్ కోటారెడ్డి, ఆత్మకూరు, సంగం సీఐలు వేణు, రవినాయక్, ఎస్సైలు ముత్యాలరావు, విశ్వనాథరెడ్డి, ప్రభాకర్, న్యాయవాదులు ఎన్వీ రమణయ్య, చిన్నపరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలి



సంగం: పేదల గృహ నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని గృహ నిర్మాణ శాఖ ఈఈ దయాకర్ సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లను ఆదేశించారు. శుక్రవారం ఆయన సంగం హౌసింగ్ కార్యాలయంలో సచివాలయం ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. లబ్ధిదారులకు సిమెంట్ కొరత రానివ్వకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. కాగా సంగానికి చెందిన కాంట్రాక్టర్ వాసుదేవరెడ్డి తమకు రావాల్సిన సిమెంట్ ఇవ్వాలని ఈఈను కోరారు. ఈ సమావేశంలో డీఈ, ఏఈలు పాల్గొన్నారు.

విద్యార్థులకు బస్‌పాస్‌ల మంజూరు

ఉదయగిరి: ఉదయగిరి ఆర్టీసీ డిపో పరిధిలోని విద్యార్థులకు ఉచిత, రాయితీ బస్‌పాస్‌లు మంజూరు చేస్తున్నామని డిపో మేనేజర్ శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. డిపో పరిధిలోని అన్ని ప్రాంతాలకు మంగళవారం నుంచి స్టూడెంట్ బస్సులు నడుపుతామని తెలిపారు. పాఠశాలకు 20 కి.మీ.లోపు నివశిస్తున్న 12 ఏళ్లలోపు విద్యార్థులు, 18 ఏళ్లలోపు విద్యార్థినులకు ఉచిత పాస్‌లు మంజూరు చేస్తున్నట్లు చెప్పారు. అర్హత కలిగిన విద్యార్థులు హెచ్‌ఎం సంతకం, పాస్‌ఫొటోతో కూడిన దరఖాస్తునకు, ఒరిజినల్ స్టడీ సర్టిఫికెట్, ఆధార్‌కార్డు జెరాక్స్ జతచేసి ఆర్టీసీ కౌంటర్‌లో అందజేసి ఉచిత బస్‌పాస్ పొందవచ్చని తెలిపారు. అలాగే నివాస ప్రాంతం నుంచి యాభై కిలోమీటర్లలోపు ఉన్న పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులకు రాయితీపై బస్‌పాస్‌లు ఇస్తున్నామని చెప్పారు. నెల, మూడు నెలలు, సంవత్సరం కాలపరిమితితో పాస్‌లు మంజూరు చేస్తున్నామని తెలిపారు. తొలుత ఏ కాలపరిమితిలో పాస్‌లు తీసుకుంటే అదే విధంగా రెన్యూవల్ చేస్తామని వివరించారు. ప్రతి రెన్యూవల్‌కు రూ.40 సర్వీస్ చార్జి చెల్లించాల్సి ఉంటుందన్నారు. దివ్యాంగులకు సైతం యాభై శాతం రాయితీపై పాస్‌లు ఇస్తున్నామని తెలిపారు. ఇందుకోసం సదరం సర్టిఫికెట్, రేషన్, ఆధార్‌కార్డు జెరాక్స్‌లు, ఫొటోతో కూడిన దరఖాస్తు ఫారాన్ని కౌంటర్‌లో అందజేసి రూ.100 చార్జి చెల్లించి పాస్‌లు పొందవచ్చన్నారు. వంద శాతం అంధత్వం, 89 శాతం కంటే తక్కువ ఐక్యూ ఉన్న వారితో పాటు వారి సహాయకులకు కూడా రాయితీ పాస్‌లు అందజేస్తున్నామని తెలిపారు. మూడేళ్ల కాలపరిమితితో అందజేసే పాస్‌లతో పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్, అల్ట్రాడీలక్స్ సర్వీసుల్లో ప్రయాణించవచ్చని వివరించారు.

ఏటీఎం పనిచేయక అవస్థ



ఆత్మకూరు: పట్టణంలోని బైపాస్‌రోడ్డులో ఉన్న స్టేట్‌బ్యాంకు ఆఫ్ ఇండియా ఏటీఎం నాలుగు రోజులుగా పనిచేయడం లేదు. ఈ ఏటీఎం ప్రధాన కూడలిలో అందరికీ అందుబాటులో ఉంటుంది. ఏటీఎం మరమ్మతులకు గురై పనిచేయకపోయిన బ్యాంకు అధికారులు పట్టించుకోకపోవడంతో వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారు. బ్యాంకు అధికారులు స్పందించి ఏటీఎంను వినియోగంలోకి తీసుకురావాలని వినియోగదారులు కోరుతున్నారు. ఈ విషయమై బ్యాంకు మేనేజర్‌ను సంప్రదించగా ఏటీఎం పిన్‌లాక్ అయిందని, ఉన్నతాధికారులకు తెలియజేశామని, త్వరలోనే సాంకేతిక సమస్యను పరిష్కరించి వినియోగంలోకి తీసుకొస్తామని తెలిపారు.

నూరు శాతం రాయితీపై పొద్దుతిరుగుడు విత్తనాలు

వరికుంటపాడు: ప్రభుత్వం రైతులకు నూరు శాతం రాయితీపై పొద్దుతిరుగుడు విత్తనాలను పంపిణీ చేస్తోందని ఏఓ రవికుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నేషనల్ మిషన్ ఆన్ ఎడిబుల్ ఆయిల్స్ పథకంలో భాగంగా అధిక దిగుబడినిచ్చే ఎన్‌డీఎస్‌హెచ్–1012 రకం పొద్దుతిరుగుడు విత్తనాలను అందజేస్తోందని చెప్పారు. 90 నుంచి 95 రోజుల్లో పంట చేతికందుతుందని, ఎకరాకు ఏడు క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుందని వివరించారు. విత్తనాలు అవసరమైన రైతులు ఆర్బీకేల్లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

సీతారామపురం: ప్రభుత్వం రైతులకు నూరు శాతం సబ్సిడీపై పొద్దుతిరుగుడు విత్తనాలను పంపిణీ చేస్తోందని ఏఓ చెన్నారెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. నేషనల్ మిషన్ అండ్ ఎడిబుల్ ఆయిల్ పథకంలో భాగంగా నూనె గింజల ఉత్పాదకతను పెంచేందుకు అధిక దిగుబడిని ఇచ్చే ఎన్‌డీఎస్‌హెచ్–1012 రకం విత్తనాలను పంపిణీ చేస్తోందని చెప్పారు. రెండు కేజీల సంచులు 265 అందుబాటులో ఉన్నాయన్నారు. విత్తనాలు కావాల్సిన రైతులు ఆర్బీకేలో సంప్రదించాలని సూచించారు.

ఉదయగిరి: నేషనల్ మిషన్ అండ్ ఎడిబుల్ ఆయిల్ పథకంలో భాగంగా రైతులకు నూరు శాతం సబ్సిడీపై పొద్దుతిరుగుడు విత్తనాలు పంపిణీ చేస్తున్నట్లు ఏఓ ఆంజనేయులునాయక్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. దేశంలో వంటనూనెల ఉత్పత్తిని పెంపొందించడంలో భాగంగా ఈ పథకాన్ని ప్రభుత్వాన్ని అమలుచేసిందన్నారు. మన రాష్ట్రంలో సాగుకు అనువైన అధిక దిగుబడి ఇచ్చే ఎన్‌డీఎస్‌హెచ్–1012 రకం విత్తనాలను సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. అవసరమైన రైతులు రైతుభరోసా కేంద్రాల్లోని గ్రామ వ్యవసాయ సహాయకులను సంప్రదించాలని కోరారు.

రైల్వే రిజర్వేషన్ కౌంటర్‌ను కొనసాగించాలి

బిట్రగుంట: బిట్రగుంట రైల్వేస్టేషన్‌లోని రిజర్వేషన్ కౌంటర్‌ను రద్దు చేసి టికెట్ బుకింగ్ సేవలను ప్రైవేట్ వ్యక్తులకు అప్పగిస్తే ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు తప్పవని బిట్రగుంట రైల్వే అభివృద్ధి కమిటీ చైర్మన్ షేక్ నూరుద్దీన్ అన్నారు. ప్రయాణికుల సౌలభ్యం, స్టేషన్ ప్రగతిని దృష్టిలో పెట్టుకుని రిజర్వేషన్ కౌంటర్‌ను యథావిధిగా కొనసాగించాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు బిట్రగుంట రైల్వే అభివృద్ధి కమిటీ సభ్యులు స్టేషన్ మాస్టర్ డీఎస్ మురళీధర్‌కు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రిజర్వేషన్ కౌంటర్ రద్దు చేయడం ద్వారా వృద్ధులు, దివ్యాంగులు, మహిళలు, ఆన్‌లైన్‌పై అవగాహన లేని వ్యక్తులు టికెట్ రిజర్వేషన్ కోసం తీవ్ర ఇబ్బందులు పడే అవకాశం ఉందన్నారు. టికెట్ బుకింగ్ కోసం కావలి, నెల్లూరు వెళ్లలేక ప్రయాణికులు ప్రత్యామ్నాయ ప్రయాణ సాధనాలపై మొగ్గు చూపుతారన్నారు. దీంతో స్టేషన్‌కు వచ్చే ఆదాయం తగ్గిపోతుందని, ఫలితంగా రైల్వేశాఖ స్టేషన్ గ్రేడ్‌ను తగ్గించి కీలక రైళ్ల స్టాపింగ్‌ను రద్దు చేసే అవకాశం ఉందన్నారు. ప్రైవేటీకరణలో భాగంగా రైల్వేశాఖ కీలక విభాగాలను ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లో పెట్టడం సరికాదన్నారు. ప్రజాధనంతో అభివృద్ధి చేస్తున్న రైల్వేలను ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. రిజర్వేషన్ కౌంటర్‌ను రద్దు చేసి టికెట్ బుకింగ్ సేవలు ప్రైవేట్ వ్యక్తులకు అప్పగిస్తే రైల్‌రోకో చేపడుతామని హెచ్చరించారు.


స్టేషన్ మాస్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న బిట్రగుంట రైల్వే అభివృద్ధి కమిటీ సభ్యులు

ప్రైవేట్ పాఠశాలలు నిబంధనలు పాటించాలి


ఉదయగిరి: హోలీ ఏంజెల్స్‌లో రికార్డులను తనిఖీ చేస్తున్న డిప్యూటీ ఏఓ గోపాల్


సీతారామపురంలో ..

ఉదయగిరి: ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు ప్రభుత్వ నియమ నిబంధనలు పాటించాలని ఆత్మకూరు ఉపవిద్యాశాఖ అధికారి గోపాల్ అన్నారు. పట్టణంలోని హోలీ ఏంజెల్స్ ఉన్నత పాఠశాలను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి యాజమాన్యానికి సూచనలు, సలహాలు అందజేశారు. ప్రభుత్వం నిర్దేశించిన సిలబస్‌ను మాత్రమే బోధన చేయాలన్నారు. స్కూల్ బస్సులకు రిజిస్ట్రేషన్, ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు తప్పనిసరిగా ఉండాలన్నారు. తొలుత ఆయన ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన స్టూడెంట్ కిట్స్ గోదామును పరిశీలించారు. ఉపాధ్యాయులకు కిట్లు పంపిణీ చేశారు. ఆయనవెంట ఎంఈఓలు షేక్ మస్తాన్ వలి, తోట శ్రీనివాసులు, ప్రధానోపాధ్యాయులు బాలకేశవులు, కరస్పాండెంట్ సుధాకర్ ఉన్నారు.

సీతారామపురం: మండలంలోని బసినేనిపల్లి జెడ్పీ హైస్కూల్, సీతారామపురంలోని గౌతమి హైస్కూల్‌ను ఆత్మకూరు ఉపవిద్యాశాఖ అధికారి గోపాల్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు పాఠ్య, నోట్ పుస్తకాలు, స్టూడెంట్ కిట్ల పంపిణీపై ఆరా తీశారు. నాడు–నేడు పనులు, మధ్యాహ్న భోజనం నాణ్యతను పరిశీలించారు. ఉపాధ్యాయులకు సూచనలు, సలహాలు అందజేశారు. ఆయన వెంట ఎంఈఓ మస్తాన్‌వలి, సీతారామపురం, బసినేనిపల్లి జెడ్పీహైస్కూల్ హెచ్‌ఎంలు శ్రీనివాసులు, అంజయ్య పాల్గొన్నారు.

ఉపాధిహామీ పనుల పరిశీలన

సీతారామపురం: మండలంలోని నూతివారికొట్టాలులో ఉపాధిహామీ పథకం కింద చేపడుతున్న మినీఅమృత్ సరోవర్ పనులను ఏపీఓ సుభాషిణి శుక్రవారం పరిశీలించారు. అనంతరం మస్టర్లను తనిఖీ చేసి కూలీలకు సూచనలు చేశారు. కొలతల ప్రకారం పనులు చేపట్టి పూర్తిస్థాయిలో రూ.300 వేతనం పొందాలని, ఉదయం 6 నుంచి 10 గంటల్లోపు పనులు పూర్తి చేసుకోవాలని సూచించారు.



దాసరపల్లిలో వైద్యశిబిరం

ఉదయగిరి: మండలంలోని దాసరపల్లిలో గండిపాళెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యసిబ్బంది శుక్రవారం వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. గ్రామంలో పారిశుధ్యం లోపించి విషజ్వరాలు ప్రబలడంపై 'సాక్షి'లో 'దాసరపల్లిలో విజృంభిస్తున్న విషజ్వరాలు' శీర్షికన శుక్రవారం కథనం రావడంతో గండిపాళెం పీహెచ్‌సీ వైద్య సిబ్బంది స్పందించారు. గ్రామానికి చేరుకుని ఇంటింటికి వెళ్లి లార్వా, జ్వరపీడితుల సర్వే చేపట్టారు. జ్వరపీడితులకు వైద్యసేవలందించారు. దోమల లార్వా నిర్మూలనకు తీసుకోవాల్సిన చర్యలను ప్రజలకు వివరించారు. జిల్లా మలేరియా నియంత్రణ సహాయ అధికారి నాగార్జున వైద్యశిబిరాన్ని పరిశీలించి సూచనలు చేశారు. దోమల నివారణకు మలాథిన్ పిచికారీతో పాటు మురుగు నిల్వ ఉన్న ప్రాంతాల్లో బ్లీచింగ్ చల్లాలని పంచాయతీ, వైద్యారోగ్య సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఈఓపీఆర్డీ మల్లికార్జున, మలేరియా సబ్‌యూనిట్ అధికారి నౌషాద్‌బాబు, సీహెచ్‌ఓ శివకుమారి, ఆరోగ్య బోధకుడు వెంకటసుబ్బయ్య, పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

సాక్షి ఎఫెక్ట్..


ఇంటింటి సర్వే చేపడుతున్న వైద్యారోగ్య సిబ్బంది

నేత్రదానం


కోటేశ్వర్‌రావు (ఫైల్)

కావలి: పట్టణంలోని పుల్లారెడ్డినగర్‌కు చెందిన శీలం కోటేశ్వర్‌రావు(86) వృద్ధాప్యంతో శుక్రవారం మృతి చెందారు. ఆయన నేత్రాలను కుమారుడు పంచాయతీరాజ్ డీఈఈ శీలం విశ్వేశ్వరరావు దానం చేశారు. తన తండ్రి కోరిక మేరకు నేత్రాలను రెడ్‌క్రాస్‌కు దానం చేసినట్లు ఆయన తెలిపారు. ఇప్పటి వరకు తమ కుటుంబ సభ్యులు ఏడుగురు నేత్రదానం చేశారని చెప్పారు. కాగా కావలి రెడ్‌క్రాస్ చైర్మన్ డీ రవిప్రకాష్ ఆధ్వర్యంలో నెల్లూరు మోడరన్ ఐ బ్యాంకు సిబ్బంది నేత్రాలను సేకరించారు. ఇది కావలి రెడ్‌క్రాస్ ద్వారా జరిగిన 133వ నేత్రదానమని రవిప్రకాష్ తెలిపారు.

50 శాతం సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలు


రైతులకు పచ్చిరొట్ట విత్తనాలను పంపిణీ చేస్తున్న ఏఓ కిషోర్

ఆత్మకూరురూరల్: వ్యవసాయ శాఖ ద్వారా రైతులకు 50 శాతం సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలను పంపిణీ చేస్తున్నట్లు ఏఓ కిషోర్ తెలిపారు. మండలంలోని నువ్వూరుపాడులో రైతులకు పచ్చిరొట్ట విత్తనాలను శుక్రవారం ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పచ్చిరొట్ట ప్రయోజనాలను రైతులకు వివరించారు. పచ్చిరొట్ట పైర్లను సాగుచేసుకుని కలయ దున్నుకోవడం ద్వారా భూసారంతో పాటు నేలలో కర్బన శాతాన్ని పెంపొందించుకోవచ్చని తెలిపారు. తద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని వివరించారు. రసాయ ఎరువుల పెట్టుబడులను గణనీయంగా తగ్గించుకోవడం ద్వారా ఆదాయాన్ని పొందవచ్చని తెలిపారు. పచ్చిరొట్ట విత్తనాలైన జీలుగలు కిలో రూ.44, జనుములు కిలో రూ.44, పిల్లిపెసర్లు కిలో రూ.67కు అందజేస్తున్నామని చెప్పారు. మండలంలోని రైతులు ఇప్పటి వరకు 38.96 క్వింటాళ్ల పిల్లిపెసర్లు, 19.80 క్వింటాళ్ల జనుములు, 115 క్వింటాళ్ల జీలుగ విత్తనాలు పొందారని తెలిపారు. పచ్చిరొట్ట విత్తనాలు కావాల్సిన రైతులు ఆధార్, పట్టాదారు పాసుపుస్తకాల జెరాక్స్ కాపీలతో ఆర్‌బీకేల్లో సంప్రదించాలని కోరారు.

వైభవంగా సీతారాముల కల్యాణం


సోమశిల: సీతారాముల గ్రామోత్సవం


సీతారామపురం: సీతారాముల కల్యాణోత్సవం

సీతారామపురం: మండలంలోని దేవమ్మచెరువులో సీతారాముల ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం కల్యాణోత్సవాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై కల్యాణాన్ని తిలకించారు. సాయంత్రం గ్రామోత్సవం నిర్వహించారు.

సోమశిల: అనంతసాగరం మండలం ఆమనిచిరువెళ్లలో సీతారాముల ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం సీతారాముల కల్యాణోత్సవం, గ్రామోత్సవాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. శనివారం వసంతోత్సవం, పారువేట ఉత్సవాలను వేడుకగా నిర్వహించనున్నట్లు గ్రామస్తులు తెలిపారు.

రక్తదానంతో ప్రాణదానం

- కావలి ఆర్డీఓ శీనానాయక్

కావలి: రక్తదానం ప్రాణదానంతో సమానమని కావలి ఆర్డీఓ శీనానాయక్ పేర్కొన్నారు. ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని కావలి రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంకులో శుక్రవారం నిర్వహించారు. ఆర్డీఓ ముఖ్యఅతిథిగా హాజరై రక్త వర్గీకరణ శాస్త్రవేత్త కార్ల్‌ల్యాండ్ స్టీనర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ దేశంలో 70 కోట్ల మంది యువకులు ఉన్నారని, వారు జీవితంలో కనీసం ఒక్కసారి రక్తదానం చేసినా దేశంలో రక్తానికి కొరత ఉండదన్నారు. దేశంలో రక్తం కొరత తీవ్రంగా ఉన్నందున యువత రక్తదానంపై అవగాహన పెంచుకుని దానం చేసేందుకు ముందుకురావాలని పిలుపునిచ్చారు. తల్లిదండ్రులు కూడా తమ బిడ్డలను ఆ దిశగా ప్రోత్సహించాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ నాగేష్, ఐఎంఏ అధ్యక్షుడు కే సుబ్బారావు, ప్రణీత్, ప్రసన్న కుమార్, హరినారపరెడ్డి, రఘుకుమార్ రెడ్డి, ప్రసన్నంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.


రక్తదాన శిబిరాన్ని ప్రారంభించిన ఆర్డీఓ శీనానాయక్

బుజ్జిరెడ్డి సంతాప సభ రేపు

ఆత్మకూరు: ఇటీవల మృతి చెందిన బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కాలం బుజ్జిరెడ్డి సంతాప సభను పట్టణంలోని త్రికోటేశ్వర కల్యాణ మండపంలో ఆదివారం నిర్వహించనున్నట్లు ఆ పార్టీ సీనియర్ నాయకుడు కుడుముల సుధాకర్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు జరిగే సంతాప సభలో పలువురు జిల్లా నాయకులు పాల్గొంటారని చెప్పారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

రేపటి నుంచి గంగాభవాని తిరునాళ్ల

సీతారామపురం: మండలంలోని సింగారెడ్డిపల్లిలో కొలువైన గంగాభవాని అమ్మవారి తిరునాళ్లను ఆదివారం నుంచి మూడ్రోజుల పాటు వైభవంగా నిర్వహించనున్నట్లు యాదవ సంఘ సభ్యులు శుక్రవారం తెలిపారు. ఆదివారం సాయంత్రం నిలుపు, విశేష పూజా కార్యక్రమాలు, సోమవారం రాత్రి అమ్మవారి ఊరేగింపు, మంగళవారం సాయంత్రం బండ్ల పొంగళ్లు నిర్వహించనున్నట్లు వివరించారు. ప్రతిరోజూ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

వెంగళరావునగర్‌లో కార్డన్‌సెర్చ్

ఉదయగిరి: మండలంలోని వెంగళరావునగర్‌లో సీఐ గిరిబాబు ప్రత్యేక పోలీసు బృందాలతో శుక్రవారం కార్డన్‌సెర్చ్ చేపట్టారు. ఇంటింటిని తనిఖీ చేసి సరైన ధ్రువీకరణపత్రాలు లేని వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ గ్రామాల్లో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు చేపడుతామన్నారు. ప్రతిఒక్కరూ కలిసిమెలిసి స్నేహపూర్వకంగా ఉండాలన్నారు. ఎవరైనా అల్లర్లు సృష్టించేందుకు ప్రయత్నిస్తే క్రిమినల్ కేసులు నమోదుచేస్తామని హెచ్చరించారు.

బీజేపీలో చేరికలు



ఆత్మకూరు: చేజర్ల మండలం మాముడూరు, చేజర్ల, గొల్లపల్లి, తదితర గ్రామాలకు చెందిన పలువురు శుక్రవారం బీజేపీలో చేరారు. బీజేపీ మండలాధ్యక్షుడు గుండాల విజయభాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో పార్టీలో చేరిన వారికి ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు బత్తల కృష్ణయ్య పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఎస్ వంశీధర్‌రెడ్డి, కుంకు బాలయ్య, వెంకట రామానాయుడు, ఎల్‌అండ్‌టీ శ్రీనివాసులు, బొమ్మాల ప్రసాద్, కే ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.